ఆంధ్రజ్యోతి
ANDHRAJYOTHY
5 తమిళనాడు TAMILNADU
ఆదివారం 2 జూన్ 2024

డీఎంకే కూటమికే 'ఎగ్జిట్ పోల్స్' పట్టం



ఏబీపీ సి ఓటర్స్	
డీఎంకే కూటమి -	37-39
అన్నాడీఎంకే కూటమి -	0-1
ఎన్‌డీఏ కూటమి -	0-1

జన్ కి బాత్	
డీఎంకే కూటమి -	34-38
అన్నాడీఎంకే కూటమి -	0-1
ఎన్‌డీఏ కూటమి -	0-5

ఇండియా న్యూస్	
డీఎంకే కూటమి -	28-33
అన్నాడీఎంకే కూటమి -	0-5
ఎన్‌డీఏ కూటమి -	0-2
ఇతరులకు -	0-4

యాక్సిస్ - మై ఇండెక్స్	
డీఎంకే కూటమి -	26-30
అన్నాడీఎంకే కూటమి -	0-2
ఎన్‌డీఏ కూటమి -	1-3

ఇండియా టుడే	
డీఎంకే కూటమి -	33-37
అన్నాడీఎంకే కూటమి -	0-2
ఎన్‌డీఏ కూటమి -	2-4

సీఎన్ఎన్ - న్యూస్ 18	
డీఎంకే కూటమి -	36-39
అన్నాడీఎంకే కూటమి -	0-2
ఎన్‌డీఏ కూటమి -	1-3

చెన్నై, జూన్ 1 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో జరిగిన లోక్‌సభ ఎన్నికల్లో డీఎంకే నేతృత్వంలోని 'ఇండియా' కూటమికే అధిక స్థానాలు కైవసం కానున్నట్లు శనివారం పలు సంస్థల 'ఎగ్జిట్‌పోల్స్' వెల్లడించాయి. దాదాపు అన్ని సంస్థలు ఇదే విధమైన ఫలితాలు వెల్లడించడంతో ఆ కూటమి నేతల్లో హర్షాతిరేకాలు వ్యక్తమయ్యాయి. డీఎంకే, కాంగ్రెస్, సీపీఐ, సీపీఎం, డీపీఐ, ఎండీఎంకే, ఐయూఎంఎల్ తదితర పార్టీలతో కూడిన కూటమి రాష్ట్రంలోని 39 స్థానాల్లో పోటీ చేయగా, అన్నాడీఎంకే చిన్నాచితకా పార్టీలతో కూడిన కూటమి ఏర్పాటు చేసి ఎన్నికల రంగంలోకి దిగింది. ఇక బీజేపీ నేతృత్వంలోని కూటమి కూడా చిన్న పార్టీలతో కలిసే ఎన్నికలను ఎదుర్కొంది. మొత్తం ఏడువిడతలతో కూడిన లోక్‌సభ ఎన్నికల్లో తొలి విడతలోనే, అంటే ఏప్రిల్ 13వ తేదీనే ఎన్నిక ముగియగా, శనివారంతో చివరిదశ కూడా ముగిసింది. ఈ నేపథ్యంలో సాయంత్రం 6 గంటల తరువాత పలు సంస్థలు ఎగ్జిట్‌పోల్స్ ప్రకటించాయి. అందులో ఇండియా కూటమికే అత్యధిక సంస్థలు అధిక స్థానాలు కట్టబెట్టాయి. ఆ వివరాలు పరిశీలిస్తే...

ముగిసిన ప్రధాని మోదీ 'ధ్యాన' పర్యటన

వివేకానంద మండపంలో 45 గంటల పాటు దీక్ష
తిరువళ్లువర్ విగ్రహానికి నివాళులు
ఆపై ఢిల్లీకి పయనం



చెన్నై, జూన్ 1 (ఆంధ్రజ్యోతి): ప్రధానమంత్రి నరేంద్ర మోదీ కన్నియాకుమారిలోని వివేకానంద రాక్‌ఫోర్టులో గత మూడు రోజుల పాటు (45 గంటల పాటు) చేసిన ధ్యాన దీక్ష శనివారంతో ముగిసింది. ఈ దీక్షను పూర్తి చేసిన తర్వాత ఆయన వివేకానంద మండపం నుంచి ప్రైవేటు బోటులో తిరువళ్లువర్ విగ్రహం వద్దకు వెళ్ళి పూల మాల వేసి నివాళులు అర్పించారు. తాను చేపట్టిన 45 గంటల ధ్యాన దీక్షను పూర్తి చేసిన తర్వాత ప్రధాని మోదీ.. తమిళ సంప్రదాయ దుస్తులైన చొక్కా, పంచె ధరించి తిరువళ్లువర్ విగ్రహానికి నివాళులు అర్పించారు. గత గురువారం సాయంత్రం కన్నియాకుమారికి చేరుకున్న మోదీ.. తొలుత భగవతి అమ్మన్ ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించిన విషయం తెలిసిందే. ఆ తర్వాత పడవలో వివేకానంద స్మారక మండపానికి చేరుకుని, ధ్యానం ప్రారంభించారు. అర్ధరాత్రి సమయంలో ఆయన కొంతసేపు ధ్యాన మండపానికి సమీపంలో ఉన్న గదిలో విశ్రాంతి తీసుకున్నారు. ఆ తర్వాత శుక్రవారం తెల్లవారుజామున 5 గంటలకు కాషాయం దుస్తులు, నుదుట విభూది, చందనం, కుంకుమ, చేతిలో రుద్రాక్ష మాలను ధరించి ధ్యానం చేపట్టారు. శనివారం జరిగిన మూడో రోజు పర్యటనలో ప్రధానమంత్రి మోదీ ఉదయాన్నే సూర్య నమస్కారాలు చేపట్టారు. ఆ తర్వాత మళ్ళీ తన ధ్యానాన్ని కొనసాగించారు. అనంతరం మధ్యాహ్నం 3 గంటలకు ప్రధాని మోదీ తన 45 గంటల దీక్షను విజయవంతంగా పూర్తి చేశారు. అటు పిమ్మట వివేకానంద మండపం నుంచి ప్రైవేటు బోటులో తిరువళ్లువర్ విగ్రహం వద్దకు వెళ్ళి నివాళులు అర్పించారు. అక్కడే సిబ్బందితో కలిసి గ్రూపు ఫోటో దిగారు. అక్కడ తమిళనాడు రాష్ట్ర జాతీయ రహదారులు, పర్యాటక శాఖకు చెందిన ఉన్నతాధికారులు ప్రధాని మోదీకి పుష్పగుచ్చాలు ఇచ్చి, సాదర స్వాగతం పలికారు. అక్కడ నుంచి ఆయన కన్నియాకుమారిలోని ప్రభుత్వ అతిథి గృహానికి చేరుకుని అక్కడ నుంచి హెలికాప్టరులో తిరువనంతపురానికి చేరుకుని, అక్కడ నుంచి ప్రత్యేక విమానంలో ఢిల్లీ బయలుదేరి వెళ్లారు.

భద్రత కట్టుదిట్టం...

ప్రధాని మోదీ పర్యటన సందర్భంగా కన్నియాకుమారితో పాటు సముద్రంలో మూడు నాటికల్ మైళ్ళ దూరం వరకు కట్టుదిట్టమైన భద్రతా ఏర్పాట్లు చేశారు. రాక్‌ఫోర్ట్ వైపు ఫిషింగ్ బోట్లు రాకుండా నిషేధం విధించారు. అలాగే, జిల్లా జాలర్లను కూడా సముద్రంలోకి చేపల వేటకు వెళ్ళకుండా నిషేధించారు. అదేసమయంలో ఆధార్ గుర్తింపు కార్డు ఉన్న పర్యాటకులను మాత్రమే వివేకానంద రాక్ వరకు అనుమతించారు. అయితే, ప్రధాని ధ్యానం చేసిన ధ్యాన మండపం వైపు మాత్రం ఒక్కరినీ అనుమతించలేదు. ఇలా ప్రధాని మూడు రోజుల పర్యటన విజయవంతంగా ముగియడంతో భద్రతా బలగాలు ఊపిరి పీల్చుకున్నాయి.



లయోలా కళాశాలలోని ఓ స్ట్రాంగ్ రూం వద్ద పోలీసు భద్రత

ఓట్ల లెక్కింపు కేంద్రాల వద్ద 3,000 మంది పోలీసులు

'వజ్ర', 'వరుణ్' వాహనాల మోహరింపు

పెరంబూర్, జూన్ 1: నగరంలోని ఓట్ల లెక్కింపు కేంద్రాల వద్ద 3,000 మంది పోలీసులు భద్రతా పనులు చేపట్టనున్నారు. రాష్ట్రంలో లోక్‌సభ ఎన్నికలు గత ఏప్రిల్ 19వ తేది ఒకే విడతలో నిర్వహించగా, ఓట్ల లెక్కింపు ఈ నెల 4వ తేదీన జరుగనుంది. చెన్నై జిల్లా పరిధిలో మూడు లోక్‌సభ స్థానాల ఓట్ల లెక్కింపు మూడు ప్రాంతాల్లో జరుగనుంది. దక్షిణ చెన్నై లోక్‌సభ నియోజకవర్గ ఓట్ల లెక్కింపు గిండి అన్నా విశ్వవిద్యాలయంలోను, ఉత్తర చెన్నై లోక్‌సభ నియోజకవర్గ ఓట్ల లెక్కింపు రాణి మేరీ కళాశాల, మధ్య చెన్నై లోక్‌సభ నియోజకవర్గ ఓట్ల లెక్కింపు లయోలా కళాశాలలో జరుగనుంది. ఈ మూడు లెక్కింపు కేంద్రాల వద్ద సుమారు 3,000 మంది పోలీసులు భద్రతా విధులు చేపట్టనున్నట్లు ఎన్నికల కమిషన్ ప్రకటించింది. నగర పోలీస్ కమిషనర్ సందీప్‌రాయ్ రాథోడ్ పర్యవేక్షణలో డిప్యూటీ కమిషనర్ ప్రేమ్ ఆనంద్‌సిన్హా, తూర్పు మండల సహాయ కమిషనర్ ధర్మరాజ్ ఈ 3వేల మందికి నేతృత్వం వహించనున్నారు. భద్రతా విధుల్లో 10 మంది డిప్యూటీ పోలీసు కమిషనర్లు, 35 మంది ఎస్‌ఐలు, 120 మంది సబ్ ఇన్స్‌పెక్టర్లు, సాయుధదళ పోలీసుల చొప్పున మొత్తం 3,000 మంది పాల్గొననున్నారు. ఆందోళనలు జరిగిన సమయంలో వాటిని అణిచివేసేందుకు 'వజ్ర', 'వరుణ్' తదితర వాహనాలు కూడా సిద్ధం చేసినట్లు నగర పోలీసు శాఖ తెలియజేసింది. ముందుజాగ్రత్త చర్యల్లో భాగంగా సమస్యాత్మక ప్రాంతాల్లో వజ్ర వాహనాలను మోహరింపజేయనున్నట్లు పోలీస్‌శాఖ పేర్కొంది.

నేత్రపర్వంగా హనుమాన్ జయంతి

ప్యారీస్, జూన్ 1: శ్రీరామ కార్యాన్ని సఫలం చేసిన మహావీరుడు, అష్టవిభూతుల శిష్ట జనరక్షకుడు ఆంజనేయ స్వామి జయంతి వేడుకలను నగరంలోని శ్రీఆంధ్ర కళా స్రవంతి శనివారం నేత్రపర్వంగా నిర్వహించింది. స్థానిక కొరట్టూరు అగ్రహారంలో ఉన్న కోదండ రామాలయంలో



హనుమాన్ జయంతి వేడుకల్లో స్రవంతి నిర్వాహకులు జేఎం నాయుడు, ఎమ్మెస్ మూర్తి తదితరులు

వైశాఖ బహుళ శుద్ధమి దశమి శుభప్రద లగ్నంలో కోలాహలంగా జరుపుకున్న ఈ వేడుకల్లో భక్తులు పెద్దసంఖ్యలో పాల్గొని రామ నామస్మరణతో తరించారు. స్రవంతి అధ్యక్షుడు జేఎం నాయుడు, సలహాదారు ఎమ్మెస్ మూర్తి, కార్యదర్శి జె.శ్రీనివాస్, కోశాధికారి జీవీ రమణ, ఇతర కమిటీ సభ్యుల పర్యవేక్షణలో ఉదయం 8 గంటల నుంచి సాయంత్రం 5 గంటల వరకు హిందూ ధర్మ పరిరక్షణ ట్రస్ట్, శ్రావ్య రాగాస్ బృందం సభ్యులు 108 సార్లు శ్రావ్యమైన రాగాలతో హనుమాన్ చాలీసా పారాయణం చేశారు. ముందుగా సీతారామలక్ష్మణ ఆంజనేయస్వామివార్లకు ప్రత్యేక అభిషేకాలు, అర్చనాది పూజలు నిర్వహించారు. లోకసంక్షేమార్థం ఆలయ ప్రధాన మండపంలో శాస్త్రోక్తంగా హోమాలు నిర్వహించారు. ఐకేఏఎస్ టెక్నాలజీస్ డైరెక్టర్ సి.శోభా రాజ కానుకగా సమర్పించిన వెండి కిరీటం, నామాలను అంజని పుత్రునికి అలంకరించి పూజలు నిర్వహించారు. అలాగే, ఆంజనేయుడికి తమలపాకులు, వడ మాలతో అలంకార పూజలు నిర్వహించారు. వేడుకల్లో భాగంగా మధ్యాహ్నం 12 గంటలకు పేదలకు అన్నదానం, భక్తులందరికి అన్నతీర్థ ప్రసాదాలు పంపిణీ చేశారు.

'వాణిజ్య పన్ను'ల శాఖకు శోభ

రూ.62 కోట్ల వ్యయంతో మౌలిక సదుపాయాలు



భవనాలను ప్రారంభిస్తున్న ముఖ్యమంత్రి

అడయార్, జూన్ 1: రాష్ట్ర ఖజానాకు అధిక ఆదాయం సమకూర్చే శాఖల్లో ఒకటిగా ఉన్న వాణిజ్య పన్నుల శాఖకు రూ.62 కోట్ల వ్యయంతో మౌలిక సదుపాయాలను ముఖ్యమంత్రి ఎంకే స్టాలిన్ ఆదేశం మేరకు ప్రభుత్వం కల్పించినట్టు ప్రభుత్వం ప్రకటించింది. సీఎం స్టాలిన్ సారథ్యంలోని డీఎంకే ప్రభుత్వ సమర్థవంతమంతైన పాలనలో వాణిజ్య పన్నుల శాఖలో అనేక సంస్కరణలు చేపట్టడం జరిగింది. ప్రధానంగా పన్నుల విధింపు, వసూళ్ళలో పారదర్శకమైన, సులభతరమైన విధానాలను అనురించడం జరుగుతోంది. రాష్ట్ర ఖజానాకు ఆదాయాన్ని పెంచేలా దోహదపడే అనేక అవగాహన ఒప్పందాలను స్వదేశీ, విదేశీ సంస్థలతో కుదుర్చుకోవడం జరిగింది. గత మూడేళ్ళ కాలంలో ప్రభుత్వం తీసుకున్న నిర్ణయాలు, ప్రవేశపెట్టి అమలు చేసిన సంస్కరణల ఫలితంగా 47.19 శాతం అదనంగా సమకూరింది. గత మూడేళ్ళలో రూ.40,399.51 కోట్ల మేరకు ఆదాయాన్ని అదనంగా ఆర్జించడం వల్ల 47.19 శాతం అభివృద్ధి కనిపించింది. తిరువళ్ళూరు, చెంగల్పట్టు, కడలూరు, తిరువారూరు, హోసూరు, తిరుప్పూరు, విరుదునగర్‌లను ప్రధానంగా చేసి ఏడు మండల డివిజన్ కార్యాలయాలను ఏర్పాటు చేయడం జరిగింది. దీంతో అధిక పన్నులు చెల్లించే కేటగిరీకి చెందిన నిర్వహణ డివిజన్‌ల సంఖ్య 12 నుంచి 19కు పెరిగింది. చెంగల్పట్టు, కడలూరు, తిరువారూర్, హోసూర్, తిరుప్పూర్, విరుదునగర్ ప్రాంతాల్లో కొత్తగా ఆరు మైక్రో డివిజన్‌లను ఏర్పాటు చేయడం జరిగింది. తమిళనాడు వాణిజ్య పన్నుల శాఖ ఆధ్వర్యంలో తొలిసారి 1998లో ప్రారంభించిన కమర్షియల్ వెల్ఫేర్ బోర్డు ఆధ్వర్యంలో అనేక సంక్షేమ పథకాలను ప్రవేశపెట్టి విజయవంతంగా అమలు చేస్తున్నారు. ముఖ్యంగా కుటుంబ సంక్షేమ సాయాన్ని రూ.లక్ష నుంచి రూ.3 లక్షలకు పెంచడం జరిగింది. వివిధ వైద్య చికిత్సలకు అందించే ఆర్థిక సాయాన్ని కూడా ప్రభుత్వం పెంచింది. ఇలాంటి ఎన్నో సంక్షేమ పథకాలను ప్రవేశపెట్టి విజయవంతంగా అమలు చేస్తున్నట్టు ప్రభుత్వం పేర్కొంది.

'ఇండియా' కూటమి భేటీకి టీఆర్ బాలు

బిజీ షెడ్యూల్‌తో పాటు జ్వరం కారణంగా వెళ్లలేకపోయిన స్టాలిన్



ఇండియా కూటమి సమావేశంలో టీఆర్ బాలు

చెన్నై, జూన్ 1 (ఆంధ్రజ్యోతి): కాంగ్రెస్ నేతృత్వంలోని 'ఇండియా' కూటమి భేటీకి ముఖ్యమంత్రి స్టాలిన్ గైర్హాజరయ్యారు. మరో రెండు రోజుల్లో లోక్‌సభ ఎన్నికల కౌంటింగ్ జరుగనుండడంతో, పార్టీ కార్యకర్తల్ని సమాయత్తం చేయడం వంటి కార్యక్రమాలతో బిజీగా వుండడంతోపాటు జ్వరం కారణంగా ఆయన ఢిల్లీలో జరిగిన ఇండియా కూటమి సమావేశానికి వెళ్లలేకపోయినట్లు డీఎంకే వర్గాలు తెలిపాయి. అయితే స్టాలిన్‌కు బదులుగా సీనియర్ నేత టీఆర్ బాలు ఆ సమావేశానికి హాజరయ్యారు. కాంగ్రెస్ జాతీయ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే నివాసంలో జరిగిన ఈ భేటీలో సుమారు 20 పార్టీల నేతలు పాల్గొనగా, టీఆర్ బాలుకు మంచి ప్రాధాన్యం లభించింది. మల్లికార్జున ఖర్గేకు కుడివైపున కాంగ్రెస్ అధినేత్రి సోనియాగాంధీ, ఎడమవైపున ఎన్‌సీపీ అధినేత శరద్‌పవార్ కూర్చోగా, ఆయన పక్కనే టీఆర్ బాలుకు స్థానం లభించింది. ఎన్నికల ఫలితాల అనంతరం ప్రధానమంత్రి అభ్యర్థిని ఎన్నుకోవడం, కూటమి పటిష్టతకు చర్యలు, భావసారూప్యత కలిగిన పార్టీలను దరి చేర్చుకోవడం వంటి వాటిపై ఈ భేటీలో చర్చించినట్లు తెలిసింది. కాగా ఈ భేటీకి స్టాలిన్ డుమ్మా కొట్టడం పట్ల రాజకీయవర్గాలు వివిధ రకాల విశ్లేషణలు చేశాయి. ఎన్నికలకు ముందు 'ఇండియా' కూటమిలో 'ఏదో' జరుగనుందంటూ విశ్లేషించాయి. అయితే అనివార్య కారణాల రీత్యా స్టాలిన్ ఢిల్లీకి వెళ్లలేకపోయారని, ఆయనకు బదులుగా సీనియర్ నేతను పంపించారని పేర్కొన్న డీఎంకే.. తాము ఇండియా కూటమితోనే వున్నామంటూ ఊహాగానాలను కొట్టిపారేసింది. దీని గురించి ఢిల్లీలో బాలు విలేఖరులతో మాట్లాడుతూ.. సీఎం స్టాలిన్ జ్వరంతో బాధ పడుతున్నారని, అందుకే ఆయన ఢిల్లీ రాలేకపోయారని వివరించారు.

విద్యుత్ సరఫరాలో అంతరాయం

గుడువాంజేరిలో అర్ధరాత్రి స్థానికుల నిరసన



నిరసన వ్యక్తం చేస్తున్న స్థానికులు

ప్యారీస్, జూన్ 1: దక్షిణ చెన్నై శివారులోని గుడువాంజేరి, పరిసర ప్రాంతాల్లో సక్రమంగా విద్యుత్ సరఫరా చేయాలని కోరుతూ స్థానికులు శుక్రవారం అర్ధరాత్రి విద్యుత్ బోర్డు కార్యాలయాన్ని ముట్టడించి నిరసన తెలిపారు. రాష్ట్రవ్యాప్తంగా రికార్డు స్థాయిలో పగటి ఉష్ణోగ్రతలు పెరుగుతున్న నేపథ్యంలో, వడగాల్పులతో ప్రజలు పడరాని పాట్లు పడుతున్నారు. ఉక్కపోత భరించలేక ప్రజలు తల్లడిల్లిపోతున్నారు. మండుతున్న ఎండల్లో ఉపశమనం పొందేందుకు ప్రజలు ఫ్యాన్లు, ఏసీలపై దృష్టి సారించారు. ఇదిలా ఉండగా, గుడువాంజేరి, పరిసర ప్రాంతాల్లో వారం రోజులకుపైగా పగలు, రాత్రి వేళల్లో విద్యుత్ సరఫరా తరచూ ఆగిపోతోంది. అంతేకాకుండా, లో ఓల్టేజీ కారణంగా ప్రజలు రాత్రుల్లో సరైన నిద్రలేక ఇబ్బందుల పాలవుతున్నారు. విద్యుత్ కోత సమస్య పరిష్కరింపజేయాలని కోరుతూ పలుమార్లు విద్యుత్ బోర్డు కార్యాలయంలో విన్నవించుకున్నా ఎలాంటి ఫలితం కనిపించలేదు. దీంతో గుడువాంజేరి, నందివరం, మాడంబాక్కం, పెరుమాట్టునల్లూర్, పాండూర్, కండివాక్కం, దర్గాస్, కాయరంబేడు, మూలక్కలని, పొత్తేరి తదితర ప్రాంతాలకు చెందిన ప్రజలు తమ ప్రాంతంలో కొనసాగుతున్న విద్యుత్ కోత సమస్యపై విద్యుత్ శాఖ మంత్రి కార్యాలయంలో కూడా ఫిర్యాదు చేశారు. ఈ నేపథ్యంలో, శుక్రవారం ఉదయం నుంచి అర్ధరాత్రి దాటే వరకు విద్యుత్ సరఫరాను నిలిపివేయడంతో ఆగ్రహించిన స్థానికులు విద్యుత్ బోర్డు కార్యాలయాన్ని ముట్టడించి నిరసన తెలిపారు. సుమారు రెండు గంటలు ఆందోళన కొనసాగిన సంబంధిత అధికారులు పట్టించుకోకపోవడంతో తెల్లవారుజామున 3 గంటలకు రోడ్డుపై బైఠాయించి విద్యుత్ బోర్డు అధికారుల వైఖరిని ఖండించారు.

వచ్చే వారం 8 చోట్ల పురావస్తు తవ్వకాలు

ఐసీఎఫ్, జూన్ 1: రాష్ట్రంలో 8 ప్రాంతాల్లో పురావస్తు తవ్వకాలు వచ్చే వారం ప్రారంభం కానున్నాయి. ఈ తవ్వకాలకు రాష్ట్ర పురావస్తు శాఖ కేంద్ర ప్రభుత్వ అనుమతి కోరింది. కేంద్ర పురావస్తు శాఖ డైరెక్టర్ బదిలీతో అనుమతిలో జాప్యం జరిగింది. జనవరిలో చేపట్టాల్సిన తవ్వకాలు వచ్చే వారం నుంచి ప్రారంభం కానున్నాయని, ఈ పనులకు రూ.5 కోట్లు ప్రభుత్వం కేటాయించిందని అధికారులు తెలిపారు. ఇదివరకే తవ్వకాలు చేపట్టిన శివగంగ జిల్లా కీళడి, విరుదుగన్ జిల్లా వెంబకోట, పుదుకోట జిల్లా పొర్‌పనైతోట, తిరువణ్ణామలై జిల్లా కీల్‌నమండి ప్రాంతాలతో పాటు కొత్తగా తెన్‌కాశి జిల్లా తిరుమలాపురం, తిరుప్పూర్ జిల్లా కొంగల్‌నగరం, కడలూరు జిల్లా మరుంకూర్, కృష్ణగిరి జిల్లా చెన్నానూరు ప్రాంతాల్లో కూడా పనులు ప్రారంభం కానున్నాయని తెలిపారు.

ఊటీలో కుండపోత

జలమయమైన రహదారులు



ఊటీలో జలమయమైన రోడ్లు

పెరంబూర్, జూన్ 1: నీలగిరి జిల్లాలో శనివారం కురిసిన భారీవర్షాలతో ప్రధాన రహదారులు జలమయమయ్యాయి. ఊటీలో ఉదయం మూడు గంటలు ఎడతెరిపి లేకుండా వర్షం కురిసింది. దీంతో, గ్రీన్‌ఫీల్డ్, లోయర్ బజార్ ప్రాంతాల్లోని ఇళ్లలో వర్షపు నీరు చేరడంతో ప్రజలు ఇబ్బందులు పడ్డారు. మార్కెట్ ప్రాంతం, కమర్షియల్ రోడ్డు ప్రాంతాల్లోని రోడ్లపై వర్షపు నీరు ప్రవహించడంతో వాహనాల రాకపోకలకు అంతరాయం కలిగింది. భారీ వర్షం కారణంగా ఊటీ కొలనులో పండ సవారీ రెండు గంటలు రద్దు చేశారు. అలాగే, ఊటీలో జరుగుతున్న రేస్ పోటీల్లో శనివారం గోల్డ్ ట్రోఫీ పోటీలు జరుగాల్సి ఉండగా, భారీ వర్షం కారణంగా రద్దు చేశారు.

సమాచార దృశ్యని

వెటర్నరీ కోర్సులకు దరఖాస్తుల ఆహ్వానం

ఐసిఎఫ్, జూన్ 1: వెటర్నరీ కోర్సుల్లో చేరేందుకు సోమవారం నుంచి దరఖాస్తు స్వీకరణ ప్రారంభం కానుంది. రాష్ట్ర వెటర్నరీ సైన్స్ విశ్వవిద్యాలయం ఆధ్వర్యంలో 7 ప్రభుత్వ వైద్యకళాశాలల్లో 660 బీవీఎస్సీ-ఏహెచ్ కోర్సులందిస్తున్నారు. వీటిలో అఖిల భారత కోటాకు 62 సీట్లు కేటాయించగా 597 సీట్లు రాష్ట్ర కోటాలో ఉన్నాయి. అదే విధంగా ఆహార సాంకేతిక, పాడిపరిశ్రమ సాంకేతిక అని బీటెక్ కోర్సుల్లో 100 సీట్లున్నాయి. వాటిలో 9 సీట్లు అఖిల భారత కోటాలో కేటాయించారు. ఈ నెల 3వ తేది నుంచి 21వ తేది వరకు https://adm.tanuvas.ac.in అనే వెబ్‌సైట్‌లో విద్యార్థులు దరఖాస్తు చేసుకోవచ్చు. అడ్మిషన్లలో 7.5 శాతం రిజర్వేషన్ ప్రకారం ప్రభుత్వ పాఠశాలల విద్యార్థులకు 53 సీట్లు కేటాయించనున్నట్లు అధికారులు తెలిపారు.

జిల్లాకు 20 ప్రజా మందుల దుకాణాలు

ఐసిఎఫ్, జూన్ 1: జిల్లాకు 20 ప్రజా మందుల దుకాణాలు ప్రారంభించాలని సహకార శాఖ ఉత్తర్వులు జారీచేసింది. సహకార సంఘాల ఆధ్వర్యంలో చింతామణి, కామధేను వంటి వాణిజ్య పేర్లతో 380 మందుల దుకాణాల్లో 20 శాతం ధరకు మందులు అందిస్తున్నారు. కేంద్ర ప్రభుత్వ నాణ్యమైన ధరలకు మందులు లభించేలా 'జన్ ఔషధ్' పేరుతో ప్రజా మందుల దుకాణాలు ప్రారంభించింది. ఈ దుకాణాల్లో రాష్ట్రంలో జిల్లాకు తలా 20 చొప్పున ప్రారంభించాలని సహకార సంఘాలకు ఆ శాఖ అదనపు రిజిస్ట్రార్ ఉత్తర్వులు జారీచేశారు.

కోటి మంది విద్యార్థుల వివరాల పరిశీలన

ఐసిఎఫ్, జూన్ 1: ప్రభుత్వ ప్రైవేటు పాఠశాలలకు చెందిన కోటి మంది విద్యార్థుల వివరాలను ఓటీపీ ద్వారా పరిశీలించినట్లు పాఠశాల విద్యాశాఖ ప్రకటించింది. విద్యార్థుల వివరాలు, పాఠశాల ప్రకటనలు తల్లిదండ్రులు తెలుసుకొనేలా వాట్సాప్ ద్వారా సమాచారాన్ని పంపేందుకు పాఠశాల విద్యాశాఖ నిర్ణయించింది. విద్యార్థుల వివరాలను ఖరారు చేసేలా ఓటీపీ పంపి మొబైల్ నెంబరు సరిచూసే పనులు నెలరోజులుగా జరుగుతున్నాయి. ఆ ప్రకారం, ప్రభుత్వ ఉన్నత, మహోన్నత పాఠశాలల్లో 34.34 లక్షల మంది విద్యార్థులు, ప్రాథమిక, మాధ్యమిక పాఠశాలల్లో 26.50 లక్షల మంది, ప్రైవేటు పాఠశాలల్లో 38.26 లక్షల మంది విద్యార్థుల మొబైల్ నెంబర్లకు ఓటీపీ నెంబర్లు పంపి వివరాలు పరిశీలించినట్లు పాఠశాల విద్యాశాఖ తెలిపింది.

'పులింగో' క్రాఫ్‌కు స్వస్తి

ఐసిఎఫ్, జూన్ 1: 'పులింగో' క్రాఫ్‌ను విరమించుకోనున్నట్లు క్షుర కార్మికులు తెలిపారు. వేసవి సెలవులు ముగిసి ఈ నెల 10 నుంచి పాఠశాలలు పునఃప్రారంభం కానున్నాయి. విద్యార్థులు హెయిర్ కటింగ్‌కు సెలూన్ షాపులకు వచ్చేటప్పుడు వారు కోరే విధంగా కాకుండా సాధారణ కటింగ్ చేయాలని, వన్ సైడ్, బాక్స్ కటింగ్ వంటి పులింగో కటింగ్ వంటివి చేయడం మానేస్తున్నట్లు క్షురకుల సంక్షేమ సంఘం తెలిపింది.

కిలంబాక్కంలో కొత్త ఫ్లై ఓవర్

ఐసిఎఫ్, జూన్ 1: కిలంబాక్కంలో కొత్త ఫ్లై ఓవర్ ఏర్పాటుచేయనున్నట్లు అధికారులు తెలిపారు. గత ఏడాది డిసెంబరులో ప్రారంభించిన కిలంబాక్కం కొత్త బస్ టెర్మినల్‌కు చెంగల్పట్టు మార్గం నుంచి వచ్చే బస్సులు కాంప్లెక్స్‌లోకి వచ్చేందుకు తగిన మార్గాలు లేవు. అదే విధంగా ఇక్కడున్న సిటీ బస్సుల బస్టాప్ నుంచి చెన్నై మీదుగా వాహనాలు ఊరపాక్కం అయనంజేరి వరకు వెళ్లి అక్కడి నుంచి గమ్యస్థానాలకు వెళ్లాల్సి ఉంటుంది. ఈ సమస్య పరిష్కరించేలా కిలంబాక్కం బస్ టెర్మినల్ ఎదుట జీఎస్‌టీ రోడ్డులో వండలూరు జంక్షన్ నుంచి కాటాన్ కొళత్తూర్ వరకు ఫ్లై ఓవర్ నిర్మాణపనులు త్వరలో ప్రారంభించనున్నామని అధికారులు తెలిపారు.

జూలై 12న తిరువాన్మియూర్ పాంబన్ స్వామిగళ్ ఆలయ కుంభాభిషేకం

ఐసిఎఫ్, జూన్ 1: స్థానిక తిరువాన్మియూర్ పాంబన్ స్వామిగళ్ ఆలయ కుంభాభిషేకం జూలై 12వ తేది జరుగనుంది. హిందూ దేవాదాయ శాఖ ఆధ్వర్యంలో ఉన్న ఈ ఆలయం మూడు ఎకరాల విస్తీర్ణం కలిగి ఉంది. ఈ ఆలయానికి 36 ఏళ్ల క్రితం కుంభాభిషేకం జరిగింది. పలు వివాదాల కారణంగా ఆగిన కుంభాభిషేకం, అన్ని సమస్యలు పరిష్కారం కావడంతో జూలై 12వ తేది నిర్వహించనున్నట్లు దేవాదాయ శాఖ అధికారులు తెలిపారు.

టీచర్లకు 18న కౌన్సెలింగ్

ఐసిఎఫ్, జూన్ 1: ఎస్టీ సంక్షేమ శాఖ పాఠశాల ఉపాధ్యాయుల బదిలీ కౌన్సిలింగ్ ఈ నెల 18వ తేది జరుగనుంది. ఈ శాఖ ఆధ్వర్యంలో పనిచేసే రెసిడెన్షియల్ ఉన్నత, మహోన్నత పాఠశాలల ప్రధానోపాధ్యాయులు, పీజీ టీచర్లు, ప్రత్యేక ఉపాధ్యాయులు, ఫిజికల్ ఎడ్యుకేషన్ టీచర్లకు ఆ రోజు ఉదయం 10 గంటల నుంచి ఆన్‌లైన్‌లో కౌన్సిలింగ్ నిర్వహించనున్నట్లు ఆ శాఖ ప్రకటన విడుదల చేసింది.

మత్స్యశాఖ పోస్టులకు దరఖాస్తుల ఆహ్వానం

ఐసిఎఫ్, జూన్ 1: మత్స్యశాఖలో ఖాళీగా ఉన్న తాత్కాలిక పోస్టులకు ఆసక్తి ఉన్న వారు దరఖాస్తు చేసుకోవాలని అధికారులు తెలిపారు.అభ్యర్థులు ఫిషరీస్ సైన్స్‌లో యూజీ, పీజీ చేసిన వారై ఉండాలి. తమిళంరాయడం,చదవడం తెలిసి,35 ఏళ్లలోపుండాలి. ఆసక్తి ఉన్న వారు స్థానిక రాయపురంలో ఉన్న మత్స్య సంక్షేమ శాఖలో ఈ నెల 21వ తేదిలోపు దరఖాస్తు చేసుకోవచ్చు. ఇతర వివరాలకు 9384824245, 9384824407 అనే నెంబర్లు సంప్రదించవచ్చు.

తగ్గిన వాణిజ్య సిలిండర్ ధర

పెరంబూర్, జూన్ 1: జూన్ నెలకు సంబంధించి వాణిజ్య వినియోగ సిలిండర్ ధరలు తగ్గాయి. ఆ ప్రకారం, నగరంలో 19 కిలోల వాణిజ్య సిలిండర్ ధర రూ.70.50 తగ్గి రూ.1,840.50కి విక్రయమవుతోంది. అలాగే, గృహ సిలిండర్ ధరలో ఎలాంటి మార్పులు లేకపోగా రూ.818.50కు విక్రయమవుతోంది. గత 2023 జూలై నుంచి ఈ ఏడాది జూన్ వరకు సిలిండర్ ధరలు రూ.300 తగ్గాయి.

4 నుంచి చదురగిరి ఆలయానికి భక్తుల అనుమతి

పెరంబూర్, జూన్ 1: చదురగిరి సుందర మహాలింగం ఆలయ ప్రదోష, అమావాస్య పూజల సందర్భంగా ఈ నెల 4 నుంచి 7వ తేది వరకు భక్తులను అనుమతించనున్నట్లు అటవీ శాఖ తెలిపింది. ఈ ఆలయంలో 4వ తేది ప్రదోషం, 6న అమావాస్య పూజలు జరుగనున్నాయి. ఈ వేడుకలను పురస్కరించుకొని మంగళవారం నుంచి 7వ తేది వరకు ఉదయం 7 నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు మాత్రమే భక్తులను అనుమతించనున్నారు. అదే సమయంలో ఆ రోజుల్లో వర్షాలు కురిస్తే ప్రజలు కొండ ఆలయానికి వెళ్లేందుకు అనుమతించమని అధికారులు తెలిపారు.

కాలం ఉన్నంత వరకు కలైంజర్

మంత్రి పీకే శేఖర్ బాబు

అడయార్, జూన్ 1: ముత్తమిళ్ అరింజ్ఞర్ డాక్టర్ కలైంజర్ కరుణానిధి శతదినోత్సవ ముగింపు వేడుకలను పురస్కరించుకుని 'కాలం ఉల్లం వరై కలైంజర్' అనే పేరుతో ఏర్పాటు ఒక ఫోటో ప్రదర్శనను ఏర్పాటు చేశారు. స్థానిక ప్యారీస్‌లోని రాజా అన్నామలై మండ్రంలో ఏర్పాటు చేసిన ఈ ప్రదర్శనను సినీ నటుడు ప్రకాష్ రాజ్ ప్రారంభించారు. ఇందులో రాష్ట్ర మంత్రి పీకే శేఖర్‌బాబు కూడా పాల్గొన్నారు. ఈ సందర్భంగా మంత్రి శేఖర్ బాబు మాట్లాడుతూ, డాక్టర్ కలైంజర్ జీవిత చరిత్రకు సంబంధించి 'తిరువారూర్‌లో ప్రారంభించి చెన్నై మెరీనా బీచ్ స్మారక మందిరం వరకు' అనే పేరుతో ఏర్పాటు చేశామన్నారు. ఈ ప్రదర్శన హాలులోకి ప్రవేశించగానే హాలోగ్రాఫిక్ టెక్నిక్ విధానంలో 40 యేళ్ళ ప్రాయంలో కనిపించినట్టుగా సందర్శకులకు కనిపిస్తారన్నారు. ఈ ప్రదర్శనలోని ఒక గదిలో 'వాళుం వరలాలు ముత్తమిళ్ అరింజ్ఞర్ కథైపాడల్' అనే ప్రదర్శన కనిపించేలా ఏర్పాటు చేశామన్నారు. అంతేకాకుండా, 90 యేళ్ళ వయసులో కరుణానిధి ప్రజలతో కలిసి మాట్లాడుతున్నట్టుగా కనిపిస్తారన్నారు. ఈ కార్యక్రమంలో ఇంకా చెన్నై మేయర్ ప్రియ తదితరులు కూడా పాల్గొన్నారు.


ప్రదర్శనను ప్రారంభిస్తున్న ప్రకాష్‌రాజ్, శేఖర్‌బాబు తదితరులు

లంచం ఆశించిన ఆర్ఐ సస్పెన్షన్

ప్యారీస్, జూన్ 1: వారసుడి సర్టిఫికెట్ పంపిణీకి రూ.2 వేలు లంచం పుచ్చుకున్న మహిళ రెవెన్యూ ఇన్స్‌పెక్టర్‌పై సస్పెన్షన్ వేటుపడింది. తిరుప్పూర్ రంగాగౌండర్‌పాళయానికి చెందిన రాజేంద్రన్ గత ఫిబ్రవరి 16వ తేది గుర్తుతెలియని వ్యక్తుల దాడిలో కత్తిపోట్లకు గురై మృతిచెందాడు. ఈ కుటుంబానికి సీఎం నివారణ నిధులు పొందే ప్రయత్నాలు చేపట్టారు. ఇందుకోసం రాజేంద్రన్ కుమారుడు జీవా (28) తిరుప్పూర్ తహసీల్దార్ కార్యాలయంలో వారసుడి ధృవీకరణ పత్రం కోసం దరఖాస్తు సమర్పించాడు. విచారణకు వెళ్లిన జీవా వద్ద ఆర్ఐ మైథిలి రూ.2 వేలు లంచం డిమాండ్ చేసినట్లు తెలిసింది. దీనిపై జీవా తిరుప్పూర్ అవినీతి నిరోధక శాఖ పోలీసులకు ఫిర్యాదుచేశారు. పోలీసుల సూచనల మేరకు రసాయనం పూసిన నోట్లను ఆర్ఐకి జీవా అందిస్తుండగా, అక్కడే మాటువేసిన పోలీసులు ఆమెను రెడ్‌హ్యాండెడ్‌గా పట్టుకున్నారు. ఈ నేపథ్యంలో, ఆమెను సస్పెండ్ చేస్తూ డీఆర్వో జైభీమ్ ఉత్తర్వులు జారీచేశారు.

పాఠశాలల మరమ్మతు పనుల్లో జాప్యం

ఐసిఎఫ్, జూన్ 1: పాఠశాలల్లో మరమ్మతుపనులు చేపట్టడంలో జాప్యం జరుగుతోంది. రాష్ట్ర పాఠశాల విద్యాశాఖ ఆధ్వర్యంలో పనిచేసే 37,553 ప్రభుత్వ పాఠశాలల్లో కొత్త విద్యా సంవత్సరం ప్రారంభం కావడానికి ముందే మరమ్మతులు చేపట్టాల్సి ఉంది. ఇందుకుగాను ప్రభుత్వ నిధులు కూడా కేటాయించింది. త్వరలో పాఠశాలలు ప్రారంభం కానున్నప్పటికీ, ఇప్పటివరకు మరమ్మతులు చేపట్టలేదు. ఈ విషయమై ప్రధానోపాధ్యాయులు మాట్లాడుతూ... ఒక్కో పాఠశాలలో చేపట్టాల్సిన మరమ్మతుల వివరాలు సేకరించారని, ఎన్నికల నిబంధనలు అమలులో ఉన్నాయనే కారణం చూపి పనులు వాయిదావేస్తున్నారని ఆరోపించారు.

మెట్రోరైళ్లలో 84.21 లక్షల మంది పయనం

పెరంబూర్, జూన్ 1: నగరంలో నడుపుతున్న మెట్రోరైళ్లలో గత మే నెలలో 84.32 లక్షల మంది ప్రయాణించారు. ఈ మేరకు సీఎంఆర్ఎల్ విడుదల చేసిన ప్రకటనలో... గత నెల 1 నుంచి 31వ తేది వరకు మెట్రోరైళ్లలో 84,21,072 మంది ప్రయాణించారు. గత జనవరిలో 84,63,384 మంది, ఫిబ్రవరిలో 8,15,008, మార్చిలో 86,82,457, ఏప్రిల్ నెలలో 80,87,712 మంది ప్రయాణించారు. ఆ ప్రకారం, ఏప్రిల్ నెలతో పోల్చితే మే నెలలో ప్రయాణికుల సంఖ్య పెరిగింది. మే నెలలో క్యూఆర్ కోడ్ ద్వారా 36,97,773 మంది, ట్రావెల్ కార్డ్‌తో 32,10,776, టోకెన్ల ద్వారా 52,055, గ్రూప్ టిక్కెట్ల ద్వారా 5,307, సింగార చెన్నై కార్డు ద్వారా 14,55,161 మంది టిక్కెట్లు పొంది ప్రయాణం చేశారు. అలాగే, మెట్రోరైళ్లలో వాట్సాప్ టిక్కెట్ (+91 8300086000) ద్వారా పేటీఎం ద్వారా టిక్కెట్లు పొందవచ్చని సీఎంఆర్ఎల్ తెలిపింది.

వినియోగం 4,769 మెగావాట్లు

పెరంబూర్, జూన్ 1: నగరంలో ఎన్నడూ లేని విధంగా శుక్రవారం విద్యుత్ వినియోగం రికార్డు స్థాయికి చేరింది. శుక్రవారం నగర విద్యుత్ వినియోగం 4,769 మెగావాట్లు (101.76 మిలియన్ యూనిట్లు)గా నమోదైంది. విద్యుత్ వినియోగం పెరిగినా ప్రజలకు ఎలాంటి ఇబ్బంది లేకుండా నిరంతరంగా విద్యుత్ అందిస్తున్నట్లు విద్యుత్ బోర్డు తెలిపింది.

ప్రపంచ చెస్ ఛాంపియన్‌షిప్ సిరీస్ నిర్వహణకు దరఖాస్తు

పెరంబూర్, జూన్ 1: నగరంలో ప్రపంచ చెస్ ఛాంపియన్‌షిప్ సిరీస్ నిర్వహించేందుకు ప్రపంచ చెస్ సమాఖ్యకు రాష్ట్రప్రభుత్వం దరఖాస్తు సమర్పించింది. ఈ సిరీస్ ఢిల్లీలో నిర్వహించేందుకు అఖిల భారత చెస్ సమాఖ్య దరఖాస్తు చేసుకోగా, సింగపూర్‌లో నిర్వహించేందుకు ఆ దేశ ప్రభుత్వం కూడా దరఖాస్తు చేసుకుంది. ఈ దరఖాస్తులు పరిశీలించి ఈనెలాఖరులో నిర్ణయం ప్రకటిస్తామని ఎఫ్ఐడీఈ ప్రకటించింది. ప్రపంచ చెస్ ఛాంపియన్‌షిప్ నవంబరు 20 నుంచి డిసెంబరు 15 వరకు నిర్వహించనున్న విషయం తెలిసిందే.

నటరాజ ఆలయాన్ని సందర్శించిన మధ్యప్రదేశ్ సీఎం

పెరంబూర్, జూన్ 1: కడలూరు జిల్లా చిదంబరం నటరాజ స్వామి ఆలయాన్ని మధ్యప్రదేశ్ ముఖ్యమంత్రి మోహన్ యాదవ్ కుటుంబసభ్యులతో సందర్శించారు. సీఎంకు ఆలయ నిర్వాహకులు పూర్ణకుంభంతో స్వాగతం పలికారు. ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించిన అనంతరం సీఎం రామేశ్వరం రామనాథస్వామి ఆలయానికి వెళ్లి స్వామి దర్శనం చేసుకొని ప్రత్యేక పూజల్లో పాల్గొన్నారు. ముఖ్యమంత్రి రాక సందర్భంగా 15 నిముషాలు భక్తులను ఆలయంలోకి అనుమతించలేదు.


ప్రత్యేక పూజల్లో మోహన్ యాదవ్ కుటుంబసభ్యులు

ఎంటీసీ బస్సుల్లో యూపీఐ ద్వారా టిక్కెట్లు

పెరంబూర్, జూన్ 1: నగరం, శివారు ప్రాంతాల్లో నడుపుతున్న ఎంటీసీ బస్సుల్లో యూపీఐ ద్వారా టిక్కెట్లు పొందే సౌకర్యం కల్పించారు. ఈ మేరకు మెట్రోట్రాన్స్‌పోర్ట్ లిమిటెడ్ (ఎంటీసీ) విడుదల చేసిన ప్రకటనలో... నగరంలోని 22 డిపోల్లో ఎలక్ట్రానిక్ టిక్కెటింగ్ మెషీన్ (ఈటీఎం)లు అందజేశారు. గత ఫిబ్రవరి 28వ తేది కొన్ని బస్సుల్లో ప్రయోగాత్మకంగా చేపట్టిన ఈ విధానం ప్రస్తుతం అన్ని డిపోల్లో అమలుకు తీసుకొచ్చారు. ఈ యంత్రాల ద్వారా యూపీఐ, కార్డు, నగదు చెల్లించి టిక్కెట్లు పొందవచ్చు. ఈ యంత్రాల పనితీరుపై కండక్టర్లకు శిక్షణ అందించారు. ప్రయాణంలో ఏవైనా ఇబ్బందులు ఎదురైతే '149' అనే నెంబరును ప్రయాణికులు సంప్రదించవచ్చని ఎంటీసీ తెలియజేసింది.

లోక్‌సభ ఎన్నికల్లో బీజేపీ చరిత్ర సృష్టిస్తుంది

కేంద్ర మంత్రి ఎల్.మురుగన్

అడయార్, జూన్ 1: ఈ నెల 4వ తేదీన వెల్లడయ్యే ఎన్నికల ఫలితాల్లో భారతీయ జనతా పార్టీ చరిత్ర సృష్టిస్తుందని బీజేపీ నీలగిరి లోక్‌సభ అభ్యర్థి ఎల్. మురుగన్ జోస్యం చెప్పారు. ఆయన శనివారం తిరుచ్చెందూరు మురుగన్ ఆలయంలో స్వామివారిని దర్శనం చేసుకున్నారు. ఆ తర్వాత ఆయన మాట్లాడుతూ, ఈ ఎన్నికల్లో బీజేపీ కూటమి 400 స్థానాలకు పైగా గెలుచుకుని, మూడో సారి అధికారంలోకి వస్తుందని జోస్యం చెప్పారు. దేశ ప్రధానిగా నరేంద్ర మోదీ మూడో సారి ప్రమాణ స్వీకారం చేస్తారన్నారు. మోదీ నాయకత్వంలో భారతదేశంలో ప్రపంచంలోనే సంపన్న దేశంగా అవతరిస్తుందని ఆయన పేర్కొన్నారు.

మోదీ ధ్యానంపై విష ప్రచారం

అన్నామలై ధ్వజం

అడయార్, జూన్ 1: ప్రధానమంత్రి నరేంద్ర మోదీ కన్నియాకుమారిలోని వివేకానంద రాక్‌పోర్టులో చేసిన ధ్యానదీక్షపై విపక్ష పార్టీలు విష ప్రచారం చేస్తున్నాయని బీజేపీ రాష్ట్ర శాఖ అధ్యక్షుడు కె.అన్నామలై ఆరోపించారు. ఆయన శనివారం తిరువణ్ణామలై అరుణాచలేశ్వర స్వామినఇ దర్శనం చేసుకున్నారు. ఈ సందర్భంగా ఆయన విలేకరులతో మాట్లాడుతూ, రాష్ట్ర ప్రజలు సుఖ శాంతులతో ఉంటూ, ప్రధానిగా నరేంద్ర మోదీ మూడోసారి దేశప్రధాని కావాలని కోరుతూ అరుణాచలేశ్వరుని ప్రార్థించినట్టు తెలిపారు. పోలీస్ ఉన్నతాధికారులను రిటైర్మెంట్ రోజున సస్పెండ్ చేయడమంటే రాజకీయ కక్ష సాధింపు చర్యలేనని అన్నారు. ఢిల్లీలో శనివారం జరిగిన ఇండియా కూటమి సమావేశానికి ఆ కూటమికి చెందిన ద్వితీయ శ్రేణి నేతలు మాత్రమే వెళ్ళారని చెప్పారు.ఎన్నికల్లో ఓటమి ఖాయమని ఆ కూటమి నేతలు ముందుగానే గ్రహించారని అందుకే ఆ కూటమికి చెందిన అగ్రనేతలు ఎవ్వరూ పాల్గొనలేదని అభిప్రాయపడ్డారు.

శునకం దాడిలో బాలుడికి గాయాలు

పెరంబూర్, జూన్ 1: స్థానిక కొరట్టూరు టీజర్స్ రోడ్డులో పెంపుడు శునకం దాడిచేయడంతో 12 ఏళ్ల బాలుడికి గాయాలయ్యాయి. రోడ్డుపై నడిచి వెళుతున్న బాలుడిని రోట్వేలర్ సహా రెండు పెంపుడు శునకాలు దాడిచేసినట్లు సమాచారం. శరీరమంతా తీవ్రగాయాలైన బాలుడిని సమీపంలో ప్రైవేటు ఆసుపత్రికి తరలించారు. నుంగంబాక్కంలోని పార్క్‌లో గత నెలలో పెంపుడు శునకాల దాడిలో ఐగేళ్ల బాలిక గాయపడిన నేపథ్యంలో, నగరంలో మరో సంఘటన చోటుచేసుకోవడంతో నగర వాసులు ఆందోళన చెందుతున్నారు.

వడపళని-కోయంబాక్కం మధ్య
కుంగిన ప్రధాన రోడ్డు

రాకపోకలకు అంతరాయం


రోడ్డు మధ్యలో ఏర్పడిన గుంత

పెరంబూర్, జూన్ 1: స్థానిక వడపళని-కోడంబాక్కం ప్రధాన రోడ్డుపై హఠాత్తుగా గుంత ఏర్పడడంతో రాకపోకలు స్తంభించాయి. ఆర్కాడు రోడ్డులో శనివారం ఉదయం హఠాత్తుగా రోడ్డు మధ్య భాగం కుంగిపోయింది. ఆ సమయంలో ఆ ప్రాంతంలో వాహనాలు లేకపోవడంతో ప్రమాదం తప్పింది. సమాచారం అందుకున్న ట్రాఫిక్ పోలీసులు అక్కడకు చేరుకొని, కుంగిన ప్రాంతంలో బ్యారికేడ్లు ఏర్పాటుచేసి వాహనాల రాకపోకలు క్రమబద్ధీకరించారు.

పీఎం గృహ నిర్మాణ పథకంలో అవినీతి

ప్యారీస్, జూన్ 1: తిరుచ్చి జిల్లా లాల్‌గుడి పంచాయతి పరిధిలో ప్రధానమంత్రి గృహనిర్మాణ పథకంలో అవినీతికి పాల్పడిన 11 మందిపై కేసు నమోదు కాగా, బీడీఓపై సస్పెన్షన్ వేటుపడింది. మరుదూర్ పంచాయతి పరిధిలో కేంద్ర ప్రభుత్వం మంజూరు చేసిన నిధులతో సొంత ఇల్లు లేని పేదల కోసం ఇళ్ల నిర్మాణాలు జరుగుతున్నాయి. ఇందులో 11 మంది అధికారులు అవకతవకలను పాల్పడ్డారని అవినీతి నిరోధక శాఖ పోలీసులు కేసు నమోదుచేశారు. ఈ అవినీతికి సహకరించారని విచారణలో తెలియడంతో, పుల్లంబాడి బీడీఓ రవిచంద్రన్‌పై శుక్రవారం పదవీ విరమణ పొందిన రోజే సస్పెన్షన్ వేటుపడింది. ఒకే కుటుంబానికి చెందిన వారిని లబ్దిదారులుగా చూపించడం, ఒకే వ్యక్తి పేరుతో రెండు ఇళ్ల నిర్మాణానికి అనుమతులు జారీచేయడం, మృతుల పేర్లతో ఇళ్ల కేటాయింపు తదితర అవకతవకలు జరిగాయని ఏసీబీ అధికారులు తెలిపారు.

15న సుందరకాండపై క్విజ్

ప్యారీస్, జూన్ 1: 'జీయర్ ఎడ్యుకేషనల్ ట్రస్ట్' (జెట్) చెన్నై విభాగం ఆధ్వర్యంలో ఈ నెల 15వ తేదీన వాల్మీకి రామాయణంలోని సుందరకాండపై క్విజ్ నిర్వహించనున్నారు. త్రిదండి చిన్న శ్రీమన్నారాయణ జీయర్ స్వామి మంగళాశాసనములతో, ప్రత్యక్ష పర్యవేక్షణలో రాయపేట పీటర్స్ రోడ్డులో ఉన్న ఈఎన్ శేష మహల్‌లో సాయంత్రం 6.30 గంటలకు వేదపారాయణంతో ప్రారంభం కానున్న క్విజ్‌లో నగరంలోని వివిధ పాఠశాలలకు చెందిన విద్యార్థినీ, విద్యార్థులు పాల్గొననున్నారు. క్విజ్ విజేతలకు ప్రథమ బహుమతిగా రూ.5,000, ద్వితీయ బహుమతిగా రూ.3,000, తృతీయ బహుమతిగా రూ.2,000, ప్రోత్సాహక బహుమతిగా ఐదుగురికి తలా రూ.1,000 చొప్పున బహూకరించనున్నట్లు జెట్ నిర్వాహకులు శనివారం విడుదల చేసిన ప్రకటనలో తెలిపారు.

డీఎంకే ఏజెంట్లకు 21 సూచనలు

వర్చ్యువల్ విధానంలో సమావేశం

అడయార్, జూన్ 1: సార్వత్రిక ఎన్నికల ప్రక్రియలో భాగంగా ఏప్రిల్ 19వ తేదీన జరిగిన పోలింగ్‌కు సంబంధించి ఓట్ల లెక్కింపు ఈ నెల 4వ తేదీన జరుగనుంది. ఇందుకోసం ఎన్నికల సంఘం అధికారులు కట్టుదిట్టమైన భద్రతా ఏర్పాట్లు చేస్తున్నారు. ఈ నేపథ్యంలో అధికార డీఎంకే తమ ఏజెంట్లకు కీలక సూచనలు చేసింది. ఇదే విషయంపై ఆ పార్టీ జిల్లా అధ్యక్షులు, అభ్యర్థులు, ఏజెంట్లతో శనివారం ఆ పార్టీ ఆర్గనైజింగ్ కార్యదర్శి ఆర్ఎస్ భారతి , శాసనసభ కార్యదర్శి ఎన్ఆర్ ఇళంగోలతో కూడిన బృందం... స్థానిక తేనాంపేటలోని పార్టీ ప్రధాన కార్యాలయమైన అన్నా అరివాలయం నుంచి వర్చ్యువల్ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఓట్ల కౌంటింగ్ కేంద్రాల్లో పార్టీ తరపున కూర్చొన ఏజెంట్లకు 21 కీలక సూచనలు చేసింది.

టీటీడీ అన్నప్రసాదం ట్రస్టుకు రూ.10 లక్షల విరాళం



తిరుమల, జూన్1(ఆంధ్రజ్యోతి): టీటీడీ ఎస్వీ అన్నప్రసాదం ట్రస్టుకు శనివారం రూ.10 లక్షలు విరాళంగా అందింది. చెన్నైకి చెందిన కిరోరిమల్ కాశీరామ్ మార్కెటింగ్ అండ్ ఏజెన్సీస్ ప్రైవేట్ లిమిటెడ్ సంస్థ ఈ విరాళాన్ని అందించింది. శ్రీవారి ఆలయం ముందు సంస్థ ప్రతినిధి రాఘవేంద్ర ఈ విరాళం డీడీలను టీటీడీ ఈవో ఏవీ ధర్మారెడ్డికి అందజేశారు.

ముగిసిన అగ్నివీరుల శిక్షణ




వేడుకల్లో పాల్గొన్న వైమానిక దళం ఉన్నతాధికారులు, గౌరవ వందనంలో అగ్నివీరులు

పెరంబూర్, జూన్ 1: స్థానిక తాంబరంలోని ఎయిర్‌ఫోర్స్ బేస్‌లో శిక్షణ ముగించుకున్న 1,983 మంది అగ్నివీరులు శనివారం మార్చ్‌ఫాస్ట్ నిర్వహించారు. వీరిలో 234 మంది మహిళలు కూడా ఉన్నారు. ఈ శిక్షణ 23 వారాలు కొనసాగింది. ముగింపు వేడుకల్లో ఎయిర్ వైస్ మార్షల్ అమన్‌కపూర్ మాట్లాడుతూ... శిక్షణ ముగించుకున్న అగ్నివీరులు వైమానిక దళంలో శారీరకంగా, మానసికంగా బాగా పనిచేయాలని సూచించారు. కార్యక్రమంలో భాగంగా అగ్నివీరులు ప్రదర్శించిన సాహసకృత్యాలు విశేషంగా అలరించాయి.

పేలిన గ్యాస్ సిలిండర్

ఆరుగురికి గాయాలు

పెరంబూర్, జూన్ 1: కడలూరు జిల్లా నెల్లికుప్పంలో ఉన్న సత్య అనే హోటల్‌లో శనివారం మధ్యాహ్నం పేలుడు సంభవించింది. ఈ ప్రమాదంలో ఆరుగురు కార్మికులకు తీవ్రగాయాలయ్యాయి. హోటల్‌లోని వంట గదిలో సిలిండర్ రెగ్యులేటర్ ప్రాంతంలో గ్యాస్ లీకేజీ గుర్తించకుండా స్విచ్ వెలిగించిన సమయంలో పెద్ద శబ్దంతో పేలుడు సంభవించింది. ఈ ఘటనలో ఆరుగురికి గాయాలుకాగా, వారిని సమీపంలోని ఆసుపత్రికి తరలించారు. ఈ ఘటనపై స్థానిక పోలీసులు కేసు నమోదుచేసి దర్యాప్తు చేపట్టారు.

హోం నుంచి ముగ్గురు బాలికల పరారీ

ఐసిఎఫ్, జూన్ 1: పుదుకోట నరిమేడు ప్రభుత్వ హోం నుంచి ముగ్గురు బాలికలు పరారయ్యారు. రైల్వేస్టేషన్లు, బస్టాండ్లు వంటి చోట్ల తల్లిదండ్రులకు, బంధువులకు దూరమై ఒంటరిగా ఉన్న పిల్లలను ఈ హోంలో చేర్చుకుంటుంటారు. ఈ నేపథ్యంలో, పదిహేడేళ్ళ వయస్సున్న బాలికలు గురువారం రాత్రి ప్రహరీ గోడ దూకి తప్పించుకున్నారు. దీని గురించి హోం సూపరింటెండెంట్ పోలీసులకు ఫిర్యాదు చేశారు. కేసు నమోదుచేసిన పోలీసులు, సీసీ టీవీ ఫుటేజీ ఆధారంగా విచారణ జరిపి గాలింపు చర్యలు చేపట్టారు.

బాలికను గర్భిణిని చేసిన మేనమామ అరెస్టు

అడయార్, జూన్ 1: ఓ పాఠశాల బాలికను గర్భిణిని చేసిన మేనమామను నగర పోలీసులు అరెస్టు చేశారు. తాజాగా వెలుగులోకి వచ్చిన వివరాలను పరిశీలిస్తే, రమేష్ (28) అనే వ్యక్తి ఒక దుకాణంలో పని చేస్తుండగా, ఆయనకు భార్య, పిల్లలు ఉన్నారు. ఆయన వద్ద తన సోదరి కుమార్తె 16 యేళ్ళ బాలిక ఉంటోంది. ఈ నేపథ్యంలో ఆ బాలికకు శుక్రవారం తీవ్రమైన కడుపునొప్పి రావడంతో రమేష్ భార్య ఆస్పత్రికి తీసుకెళ్ళగా, అక్కడ వైద్యులు బాలికను పరీక్షించి గర్భందాల్చినట్టు నిర్ధారించారు. ఈ విషయం తెలుసుకున్న బాలిక తల్లిదండ్రులు తీవ్ర దిగ్భ్రాంతికి గురై, బాలికను నిలదీయగా, అసలు విషయాన్ని వెల్లడించింది. బాలిక తల్లిదండ్రులు ఇచ్చిన ఫిర్యాదు మేరకు మహిళా పోలీసులు కేసు నమోదు చేసి రమేష్‌ను అరెస్టు చేశారు.

గంజాయి తరలిస్తున్న ఇద్దరి అరెస్ట్

ప్యారీస్, జూన్ 1: స్థానిక అమింజికరై ప్రాంతంలో బైక్‌లో చట్టవిరుద్ధంగా తరలించిన 3 కిలోల గంజాయి పోలీసులు స్వాధీనం చేసుకొని, బాలుడు సహా యువకుడిని అరెస్ట్ చేశారు. అమింజికరై ప్రాంతంలో బైక్‌లో తిరుగుతూ గంజాయి పొట్లాలు విక్రయిస్తున్నట్లు బైక్ రిజిస్ట్రేషన్ నెంబరు సహా అందిన సమాచారంతో ఇన్స్‌పెక్టర్ కృపానిధి నేతృత్వంలోని బృందం శుక్రవారం రాత్రి తనిఖీలు నిర్వహించింది. ఎన్ఎస్కే నగర్ ట్రాఫిక్ సిగ్నల్ వద్ద బైక్‌లో నిలబడిన ఇద్దరిని అదుపులోకి తీసుకొని జరిపిన విచారణలో వారు మధురాంతకంకు చెందిన లోకేశ్వరన్ (23), 19 ఏళ్ల మైనర్ బాలుడని తెలిసింది. వారి నుంచి 3 కిలోల 100 గ్రాముల గంజాయి, బైక్‌ను స్వాధీనం చేసుకొని, ఎగ్మూర్ కోర్టులో హాజరుపరచి పుళల్ జైలుకు తరలించారు.

కోతలు లేని విద్యుత్ సరఫరాకు చర్యలు

మరమ్మతులకు 60 ప్రత్యేక బృందాలు

పెరంబూర్, జూన్ 1: రాష్ట్రవ్యాప్తంగా ఎండ తీవ్రత అధికంగా ఉన్న నేపథ్యంలో కోతలు లేకుండా విద్యుత్ సరఫరా చేసేందుకు ప్రభుత్వం చర్యలు చేపట్టింది సత్వర మరమ్మతులు చేపట్టేందుకు 60 ప్రత్యేక బృందాలను రాష్ట్ర విద్యుత్ బోర్డు ఏర్పాటుచేసింది. నగరంలోని తమిళనాడు విద్యుదుత్పత్తి, సరఫరా సంస్థ ప్రధాన కార్యాలయంలో శనివారం ఆ సంస్థ అధ్యక్షుడు ప్రదీప్ యాదవ్ రాష్ట్రంలోని అన్ని మండలాల అధికారులు, ప్రధాన ఇంజనీర్లతో వీడియో కాన్ఫరెన్స్ ద్వారా సమావేశమయ్యారు. రాష్ట్రంలో కొద్దిరోజులుగా ఎండ తీవ్రత అధికంగా ఉండడంతో గత మే 2వ తేది విద్యుత్ వినియోగం 20,830 మెగావాట్ల గరిష్టస్థాయికి చేరుకుంది. ఎండ తీవ్రత కారణంగా ట్రాన్స్‌ఫార్మర్లలో లోడు అధికమై పేలిపోవడం, పిల్లర్ బాక్స్‌లు మరమ్మతులకు గురి కావడంతో కొన్ని ప్రాంతాల్లో విద్యుత్ కోతలు సంభవిస్తున్నాయి. ఈ విషయమై ప్రదీప్ యాదవ్ మాట్లాడుతూ... ప్రజలకు కోతలు లేని విద్యుత్ అందించేలా అన్ని చర్యలు చేపట్టామన్నారు. ఎండ తీవ్రత వల్ల కొన్ని ప్రాంతాల్లో ట్రాన్స్‌ఫార్మర్లు, పిల్లర్ బాక్స్‌లు దెబ్బతింటున్నాయని తెలిపారు. సమాచారం అందుకున్న వెంటనే సిబ్బంది అక్కడకు చేరుకొని మరమ్మతులు చేపట్టి విద్యుత్ సరఫరా పునరుద్ధరిస్తున్నారన్నారు.

శ్రీసత్యసాయి జిల్లాలో కారు బోల్తా

తమిళనాడుకు చెందిన ఒకరి మృతి.. ముగ్గురికి గాయాలు




ప్రమాదానికి గురైన కారు, మృతి చెందిన రాజశేఖర్

హిందూపురం అర్బన్, జూన్1: శ్రీసత్యసాయి జిల్లా పరిగి మండలం ధనాపురం సమీపంలో కారు బోల్తాపడి తమిళనాడుకు చెందిన రాజశేఖర్ (50) మృతిచెందారు. తమిళమణి, సెల్వరాజ్, రామకృష్ణన్ గాయపడ్డారు. తమిళనాడులోని ధర్మపురి జిల్లా పెన్నాగరం గ్రామానికి చెందిన వీరు నలుగురూ ఎక్స్‌కవేటర్ అద్దె వసూలు చేసేందుకు శనివారం ఉదయం హోసూరు నుంచి శ్రీసత్యసాయి జిల్లా మడకశిరకు బయలుదేరారు. ధనాపురం వద్దకు రాగానే కారు అదుపుతప్పి రోడ్డు పక్కన బోల్తా పడింది. దీంతో రాజశేఖర్(50) అక్కడికక్కడే మృతి చెందగా.. మిగిలిన ముగ్గురు గాయపడ్డారు. వీరిని 108 వాహనంలో హిందూపురం ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

కోలాహలంగా ఏర్వాడి దర్గా ఉరుసు



ప్యారీస్, జూన్ 1: రామనాథపురం జిల్లా కీల్‌కరై సమీపంలో ప్రసిద్ధిచెందిన ఏర్వాడి కుతుబ్‌సుల్తాన్ సయ్యద్ ఇబ్రహీం బాదుషా దర్గా 850వ ఉరుసు మహోత్సవం కోలాహలంగా జరుగుతోంది. 23 రోజులు నిర్వహించనున్న ఈ ఉత్సవం ఈ నెల 5న ముక్తవల్లీల ప్రత్యేక ప్రార్థనలతో ప్రారంభమయ్యాయి. 19న పతాకావిష్కరణలో వేలాది మంది భక్తులు పాల్గొన్నారు. ఈ నెల 7వ తేది వరకు కొనసాగనున్న ఈ ఉత్సవాల్లో ప్రధానాంశమైన గంధం పాత్ర ఊరేగింపు శుక్రవారం రాత్రి 11 గంటలకు దర్గా ప్రధాన ప్రవేశద్వారం వద్దనున్న ఇబ్రహీం మహల్ నుంచి ప్రారంభమైంది. అలంకార రథంతో గంధం పాత్ర ఏర్పాటుచేసిన వాహనం ముందు వెనుక ఇస్లామీయులు కాగడాలు చేతబూని పాటలు పాడుతూ సందడి చేశారు. శనివారం ఉదయం 6 గంటల వరకు చందనం పాత్ర ఉన్న వాహనం దర్గాను మూడు సార్లు ప్రదక్షిణం చేయగా, నిర్వాహకులు విశ్వశాంతి కోరుతూ ప్రత్యేక ప్రార్థనలు చేశారు. ఈ ఊరేగింపులో రాష్ట్రం నలుమూలల నుంచే కాకుండా కేరళ, కర్ణాటక, ఆంధ్రప్రదేశ్, తెలంగాణా తదితర రాష్ట్రాలకు చెందిన భక్తులు పాల్గొనగా, వారికి దర్గా నిర్వాహకులు గంధాన్ని ప్రసాదంగా పంపిణీ చేశారు. ఈ నెల 7వ తేది సాయంత్రం 5.30 గంటలకు పతాక అవనతం సందర్భంగా భక్తులందరికి నెయ్యితో తయారుచేసిన ప్రసాదం పంపిణీ చేయనున్నారు.


శనివారం రాజ్‌భవన్‌లో జరిగిన తెలంగాణ ఆవిర్భావ దినోత్సవంలో పాల్గొన్న రాష్ట్ర గవర్నర్ ఆర్ఎన్ రవి, అఖిల భారత తెలుగు సమ్మేళనం వ్యవస్థాపకులు డాక్టర్ సీఎంకే రెడ్డి, సంస్థ ఉపాధ్యక్షుడు డాక్టర్ సీఎం కిశోర్ తదితరులు

SUNDAY SPECIAL



పదహారేళ్లకు ముందు పావురాలకు దాణా వేస్తున్న రాజస్థానీయుడు - ఫీడింగ్ సెంటర్ వెనుకవైపు ప్రకటన బోర్డు



వేకువజామున మెరీనాలో అద్భుత దృశ్యం

మెరీనాబీచ్ పిజియన్ ఫీడింగ్ సెంటర్ వితరణ



16 ఏళ్లుగా లక్ష పావురాలకు దాణా!



పావురాలకు చివరి విడత దాణా వేయడానికి సిద్ధమవుతున్న నిర్వాహకులు

చెన్నై, జూన్ 1 (ఆంధ్రజ్యోతి): ప్రపంచంలో అతి పొడవైన సముద్రతీరం కలిగిన బీచ్‌లలో రెండో బీచ్‌గా పేరుగడించిన మెరీనాబీచ్.. సమయం వేకువజాము 4.30 గంటలు... పసుపు చొక్కాలు ధరించిన వలంటీర్లు కొందరు అల్యూమినియం పాత్రల్లో, ప్లాస్టిక్ పాత్రల్లో నింపిన మొక్కజొన్నలు, సెనగలు, పెసరపప్పు, గోధుమ గింజలు మోసుకుంటూ వెళ్ళి, రైతులు పంటపొలాల్లో వడ్ల గింజలు చల్లినట్లు గింజలను ఇసుకనేలపె చల్లారు.. చతురస్రాకారంలో ఇసుకనేలపై చల్లిన ఆ గింజలన్నీ ఆకాశంలో ఎగురుకుంటూ వేల సంఖ్యలో రానున్న అతిథుల కోసమే! వలంటీర్లు గింజలు చల్లడాన్ని పూర్తి చేసి బీచ్ సర్వీసు రోడ్డువైపు ఉన్న రెండు రేకుల షెడ్లకు చేరుకున్నారు.. ఆకాశం వైపు చూస్తూ కూర్చున్నారు. సమయం వేకువజాము ఇంచుమించు ఐదుగంటలు కావస్తోంది. సముద్ర తీరం వైపు దూసుకొస్తున్న అలల సవ్వడి చెవుల్ని చీల్చుతుండగా.. ఎక్కడి నుంచో మరో సవ్వడి. ఏంటా అని పరికిస్తే.. ఇసుక నేలపై చతురస్రాకారంలో అందంగా పరచిన మొక్క జొన్నగింజలు, శెనగలు, సజ్జలపై వందల సంఖ్యలో పావురాలు గుంపులు గుంపులుగా కవాతు జరిపేందుకు వచ్చిన సైనికుల్లా క్రమశిక్షణగా వచ్చి వాలాయి.. చూస్తుండగానే పావుగంటకల్లా అక్కడ సుమారు లక్ష వరకూ పావురాలు గుమికూడి ఆహారాన్ని ఆబగా ఆరగించాయి. ఆ పావురాలకు వాకింగ్‌కు వచ్చే పాదచారులు, బీచ్ తీర సందర్శకుల నుంచి ఎలాంటి ఆటంకం కలుగకుండా నలువైపులా తాడు కట్టారు.. ఆ పావురాళ్ల దగ్గరకు ఎవరూ వెళ్ళకుండా వలంటీర్లు చేత బెత్తం పట్టుకుని కాపలా కాశారు. ఎవరైనా కుర్రాళ్లు ఆ పావురాలకు దగ్గరగా వస్తుంటే వారిని దూరంగా వెళ్లమంటూ సైగలతో హెచ్చరించారు. అదే సమయంలో సందర్శకులతోపాటు వచ్చిన చిన్నారులు ఉత్సాహంతో ఆ పావురాల వైపు దూసుకెళితే ఆహారం తింటున్న పావురాలన్నీ ఒక్కసారిగా రెక్కలను టపటపా కొట్టుకుంటూ అంత ఎత్తుకు పైకెగిరాయి. తమకు ఎలాంటి ఆపదలేదని క్షణాలలో గ్రహించే ఆ పావురాలు మళ్ళీ ఆహారం పరచి ఉన్న ఇసుకనేలపై జట్లుజట్లుగా వాలి మళ్ళీ ఆహారాన్ని భుజించాయి..

ప్రతిరోజూ మెరీనాబీచ్‌లో అన్నాదురై సమాధి ప్రాంతం నుంచి లైట్‌హౌస్‌దాకా వాకింగ్ వెళ్లే నగరవాసులు, పర్యాటకులకు ఈ దృశ్యాలు చిరపరిచితమే.. వేల సంఖ్యలో పావురాలు ఆబగా ఆహారాన్ని భుజించే అందమైన దృశ్యాన్ని తప్పకుండా చూసి ఆనందిస్తుంటారు. అక్కడి నిర్వాహకులతో కాసేపు మాట్లాడి పావురాలకు ఆహార సంతర్పణ ఎలా జరుపుతారో వివరాలు అడిగి తెలుసుకుంటారు. వారి పక్షుల ప్రేమను మెచ్చుకుంటూ తోచినంత ధనసహాయాన్ని అప్పటికప్పుడు అందిస్తారు. మరి కొందరు పావురాళ్ల, కాకుల దాణాకు, శునకాలకు పాలు, బిస్కెట్ల పంపిణీకి అయ్యే మొత్తం ఖర్చు వివరాలను తెలుసుకుని ఆ మొత్తాన్ని విరాళంగా అందిస్తున్నారు. ఇలా యేడాదిపాటు ప్రతిరోజూ నిర్దిష్ట సమయంలో సుమారు లక్షకు పైగా పావురాళ్లకు వందల సంఖ్యలో కాకులకు, శునకాలకు ఆహారం అందిస్తున్న మెరీనాబీచ్ పిజియన్ ఫీడింగ్ సెంటర్ నిర్వాహకుల వివరాలు గురించి ఆరా తీసినప్పుడు అందరూ అంకితభావంతో పావురాళ్లకు దాణా అందించటమే తమ కర్తవ్యంగా భావించి సేవాభావంతో ఈ నిత్య యాగాన్ని నిర్విఘ్నంగా సాగిస్తున్నారని తెలిసింది. కరోనా లాక్‌డౌన్ సమయంలోనూ వీరు ఆ పావురాళ్లను పస్తుల్లో ఉంచలేదంటే ఆశ్చర్యం కలుగకమానదు. ప్రస్తుతం ఈ సెంటర్ నిర్వహణ బాధ్యతలను భగారామ్ సోలంకీ, జగదీష్, మదన్‌లాల్. భీమ్‌రాజ్ మాలిక్, కీమిచంద్ సురానా, నేమీచంద్ కఠారీయా అనే ఆరుగురు తమ భుజస్కంధాలపై వేసుకుని సమర్థవంతంగా నిర్వర్తిస్తున్నారు.

రోజుకు 1000 కేజీల దాణా...

ప్రస్తుతం ఈ కేంద్రం వద్ద పక్షులకు రోజూ ఆహారం అందించే పనులను నిర్వర్తిస్తున్న భగారామ్ సోలంకీ మాట్లాడుతూ.. పదహారేళ్లుగా ఓ వైపు లక్షల సంఖ్యలో పావురాళ్లకు, మరో వైపు వందల సంఖ్యలో శునకాలకు, వేల సంఖ్యలో కాకులకు ఒకే సమయంలో దాణా అందిస్తున్నట్లు చెప్పారు. తొలుత శునకాలు, కాకుల వల్ల పావురాలు దాణా తినటానికి భయపడుతుండేవని, ఈ విషయం గమనించిన తమ సెంటర్ పూర్వ నిర్వాహకులు పావురాలకు ఆహారం వేస్తున్నప్పుడే సర్వీసు రోడ్డుకు మరో వైపు శునకాలకు, కాకులకు కూడా ఆహారం అందించాలని నిర్ణయించినట్లు తెలిపారు. ఆ మేరకు ప్రతిరోజూ శునకాలకు బిస్కెట్లు కలిపిన పాలు, కాకులకు కారప్పూస అందిస్తున్నట్లు చెప్పారు. ఈ సెంటర్ నిర్వహించేందుకు విరాళాలు భారీగానే అందుతున్నాయని, ఈ చోట వేకువజాము ఐదు నుండి ఉదయం ఏడు గంటల దాకా పావురాలకు వెయ్యి కేజీల దాణాలను అందిస్తుండటం చూసి ఆశ్చర్యపడే పాదచారులు విరాళాలు అందిస్తుంటారని, వీరి కోసం ఓ విరాళాల సేకరణ పెట్టెను కూడా ఉంచామని చెప్పారు. నగదు రూపంలో కంటే వస్తురూపంలోనే ఎక్కువగా విరాళాలు అందుతున్నాయని, చాలామంది పుట్టినరోజు వేడుకలు, వివాహ వార్షికోత్సవాల సమయం, తమ కుటుంబీకుల సంస్మరణ దినాల సందర్భంగా బస్తాల కొద్దీ మొక్కజొన్నలు, సజ్జలు, గోధుమలను విరాళంగా అందిస్తున్నారని చెప్పారు. ప్రతిరోజూ తనతోపాటు వలంటీర్లందరూ వేకువజాము 3.45 గంటలకు షావుకారుపేట నుండి బయలుదేరి మెరీనాబీచ్ పిజియన్ ఫీడింగ్ సెంటర్‌కు చేరుకుంటామని, ఆ తర్వాత షెడ్లలో ఉన్న బస్తాలను దించి, వాటిలోని మొక్కజొన్నలు, సజ్జలు, సెనగలను అల్యూమినియం పాత్రలలో మోసుకెళ్ళి పావురాలు వాలే చోట అందంగా చల్లుతామన్నారు. అదే సమయంలో ఆ దాణా చుట్టూ తాళ్లను కట్టి సందర్శకుల వల్ల పావురాలకు ఎలాంటి ఇబ్బంది కలుగకుండా చూస్తామన్నారు. తనతో పాటుగా మదన్‌లాల్, జగదీష్, భీమ్‌రాజ్ మాలిక్, కీమిచంద్ సురానా, నేమీచంద్ కఠారీయా మరికొంతమంది వలంటీర్లు ఈ నిర్విరామ సేవాకార్యక్రమంలో పాలుపంచుకుంటున్నారని చెప్పారు.



విరాళాల పెట్టె

ఎవరిదీ ఆలోచన..?

మెరీనాబీచ్‌లో పావురాళ్లకు దాణా అందించాలనే ఆలోచన ఈ సెంటర్ నిర్వాహకులకు ఎలా వచ్చింది? ఈ సత్కార్యంలో పాలుపంచుకుంటున్నవారెవరు? ఈ సెంటర్ ప్రారంభించిన వారెవరు? అనే ప్రశ్నలకు సులువుగానే సమాధానాలు లభిస్తాయి. షావుకారుపేటలో నివసిస్తున్న ఇద్దరు రాజస్థాన్ వ్యాపారులకు ఈ ఆలోచన కలిగింది. 2008లో రోజుకు రెండు కేజీల దాణాతో మెరీనాబీచ్ పిజియన్ ఫీడింగ్ సెంటర్ తన సేవలను ప్రారంభించింది. ప్రస్తుతం ఇంతింతై వటుడింతై అన్నట్లు రోజుకు వెయ్యి కేజీల దాణాను పావురాలకు అందిస్తున్నారు. ఈ సేవా విస్తరణ వెనుక ఎంతోమంది రాజస్థానీయుల నిర్విరామ కృషి దాగి ఉంది. షావుకారుపేటలో నివసిస్తున్న రాజస్థాన్ వ్యాపారులు ఇరువురు బీచ్‌లో ఉదయం పూట వాకింగ్‌కు వెళుతూ తీరం వైపు కొన్ని పావురాలు ఎగురుకుంటూ వెళుతుండటాన్ని గమనించారు.రాజస్థాన్‌లో ఉన్నప్పుడు పక్షులకు దాణా వేసే అలవాటు తమ సంస్కృతిలో భాగంగా ఉండేదనే విషయం గుర్తుకొచ్చింది. ఆ మరుసటి రోజు ఆ ఇరువురూ పావురాల కోసం దుకాణంలో మొక్క జొన్న గింజలను కొనుక్కుని వెళ్ళారు. వివేకానందర్ ఇల్లమ్ ఎదురుగా వాకింగ్ సర్వీసురోడ్డును ఆనుకుని ఉన్న ప్రాంతంలో కొన్ని పావురాలు ఎగురుకుంటూ వచ్చాయి. వెంటనే వీరు తమ వెంట తీసుకెళ్లిన మొక్కజొన్న గింజలను ఇసుకనేలపై చల్లారు. కాసేపు అటూ ఇటూ ఎగిరిన పావురాలు టకీమని ఆ మొక్కజొన్న గింజలపై వాలాయి.ఆబగా వాటిని ఆరగించి ఆనందంగా టపటపామం టూ రెక్కలు కొట్టుకుంటూ ఎగురుకుంటూ వెళ్ళాయి. 2008 డిసెంబర్‌లో ఓ రోజు ప్రారంభమైన ఈ పక్షుల సేవ నిర్విరామంగా కొనసాగుతోంది. మెరీనాబీచ్ పక్షుల దాణా కేంద్రం ఏర్పాటైంది. ఆ కేంద్రం నిర్విరామంగా సేవలందించటం వెనుక పేరు చెప్పేందుకు ఇష్టపడని దాతలెందరో ఉన్నారు.

ఈ సెంటర్ ఎక్కడుంది?



నిర్వాహకులు జగదీష్ భగారామ్ సోలంకీ, మదన్‌లాల్

మెరీనాబీచ్‌లోని వివేకానందర్ ఇల్లమ్‌కు ఎదురుగా బీచ్ సర్వీసు రోడ్డుకు కుడివైపు కాసింత దూరంలో రెండు బడ్డీ కొట్లలాగా చిన్న సైజులతో ఇనుపరేకులతో తయారైన రెండు షెడ్లు కనిపిస్తాయి. ఆ షెడ్ల వెనుక 'మెరీనాబీచ్ పిజియన్ ఫీడింగ్ సెంటర్' అనే ప్రకటన బోర్డు కనిపిస్తుంది. ఆ బోర్డులో పావురాలు, శునకాలు, కాకులకు ఆహారం అందించేందుకు యేడాదికి అయ్యేఖర్చులను విరాళంగా ఇచ్చినవారి దాతల పేర్లు ఉంటాయి. విరాళాలు ఇచ్చిన దాతల్లో ముప్పావు శాతం మంది రాజస్థానీయులే కావటం విశేషం. రోజూ వేకువజాము ఐదుగంటలకల్లా ఆ చోటకు వెళితే అప్పుడే గుంపులు గుంపులుగా సవ్వడి చేసుకుంటూ వాలుతున్న పావురాలను చూడవచ్చు. వేకుజాము 5.30 గంటలకు సుమారు లక్ష పావురాలు ఆ చోట దాణాను భుజిస్తాయి. రాజధాని నగరం ఎల్లప్పుడూ శాంతి నగరంగానే ఉంటోంది. ఆ శాంతికి చిహ్నాలే ఈ పావురాలు. ఒకే సమయంలో లక్షకు పైగా శాంతికపోతాలు గుమికూడే ప్రాంతమిదేనంటే అతిశయోక్తి కాదు.



విలేకరుల సమావేశంలో చిత్ర బృందం

చిత్రజ్యోతి

విడుదలకు సిద్ధమైన 'అంజామై'

అనేక విజయవంతమైన చిత్రాలను నిర్మించిన ప్రముఖ చిత్ర నిర్మాణ సంస్థ డ్రీమ్ వారియర్ పిక్చర్స్, తిరుచిత్రం సహకారంతో నిర్మించిన మూవీ 'అంజామై'. మోహన్ రాజా, లింగుస్వామి వంటి స్టార్ దర్శకుల వద్ద అసిస్టెంట్‌గా పనిచేసిన ఎస్.పి.సుబ్బురామన్ దర్శకత్వం వహించారు. విదార్థ్, వాణి భోజన్, రఘుమాన్, కృతికామోహన్, బాలచంద్రన్, ఏఏఎస్ వంటి పలువురు నటీనటులు నటించారు. కార్తీక్ ఛాయాగ్రహణం, రాఘవ్ ప్రసాద్ సంగీత స్వరాలు సమకూర్చగా, కలా చరణ్ నేపథ్య సంగీతం అందించారు. ఈ నెల 7న విడుదలకానుంది. దీన్ని పురస్కరించుకుని చిత్రం బృందం శుక్రవారం చెన్నైలో విలేకరుల సమావేశాన్ని ఏర్పాటు చేసింది. ఇందులో చిత్ర దర్శకుడు సుబ్బురామన్ మాట్లాడుతూ... 'ఈ చిత్ర నిర్మాతల్లో ఒకరైన తిరునావుక్కరసు కేవలం వైద్యుడు మాత్రమే కాదు మనో వైద్యుడు. ప్రొఫెసర్, రచయిత, వక్త, సామాజిక ఆలోచనాపరుడు, తమిళ ఉద్యమకారుడు ఇలా బహుముఖ ప్రజ్ఞాశాలి. అలాంటి వ్యక్తి నుంచి నేను పాస్ మార్కులు వేయించుకోవడం చాలా సంతోషంగా ఉంది. డ్రీమ్ వారియర్స్ సంస్థలో ఒక చిత్రం చేయాలన్న కల ప్రతి ఒక్కరికీ ఉంటుంది. వారు ఒక కథను సామాన్యంగా అంగీకరించరు. ఈ చిత్రాన్ని నిర్మించేందుకు ఆ సంస్థ అధిపతులు ముందుకు రావడం తొలి విజయం. అధికారంలో ఉన్నవాడు సామాన్యుడిని ఎలా ప్రభావితం చేస్తాడు. అలా ప్రభావితమైన ఓ వ్యక్తి కథే ఈ చిత్ర స్టోరీ. తమ పిల్లల చదువుల కోసం తల్లిదండ్రులు ఎంతలా కష్టపడుతున్నారనే విషయాన్ని చెప్పాం. ఇలా నేటి సమాజంలో జరుగుతున్న అనేక విషయాలను వెండితెరపై చూపించాం' అన్నారు. నటుడు విదార్థ్ మాట్లాడుతూ... 'ఇలాంటి ఒక మంచి చిత్రంలో నటించినందుకు చాలా సంతోషంగా ఉంది. నాలుగు కాలాల్లో జరిగే కథ. దిండిగల్‌లో షూటింగ్ పూర్తి చేశాం. ఒక పాత్రలో మలయాళ నటుడు మమ్ముట్టి నటించాల్సి ఉంది. ఆయన కాల్షీట్ లభించకపోవడంతో రఘుమాన్‌ను ఎంపిక చేశారు. నిర్మాణం పూర్తయిన తర్వాత డ్రీమ్ వారియర్ నిర్మాతలు చూసి ఈ సినిమాను సొంతం చేసుకున్నారు. అన్ని వర్గాల ప్రేక్షకులను ఆకట్టుకునేలా దర్శకుడు తెరకెక్కించారు' అన్నారు. అలాగే, నిర్మాతలు తిరునావుక్కరసు, ఎస్ఆర్ ప్రభు, నటి వాణి భోజన్ తదితరులు నటించారు.

హర్రర్ చిత్రాల్లో నటించడం సులభం

● రాశీఖన్నా



హర్రర్ చిత్రాల్లో నటించడం సులభమని, కానీ, దర్శకత్వం వహించడం చాలా కష్టమని హీరోయిన్ రాశీఖన్నా అన్నారు.ఇటీవల సుందర్ సి దర్శకత్వంలో వచ్చిన 'అరణ్మనై-4' చిత్రంలోని హీరోయిన్లలో ఒకరైన రాశీఖన్నా మాట్లాడుతూ... 'గతంతో నేను తమిళంలో నటించిన 'తిరుచిత్రాంబలం', 'సర్దార్' వంటి చిత్రాలు హిట్ అయ్యాయి. ఇపుడు 'అరణ్మనై-4' కూడా విజయవంతంగా నిలిచింది. నాకు హ్యాట్రిక్. చిన్నప్పటి నుంచి హర్రర్ చిత్రాలంటే అమితమైన ఇష్టం. అలాంటిది అరణ్మనై-4లో అవకాశం రావడం సంతోషంగా ఉంది. నిజానికి ఈ తరహా చిత్రాల్లో నటించడం సులభం. దర్శకత్వం వహించడమే కష్టం. భాషను అర్థం చేసుకుంటే ప్రేక్షకుల చెంతకు చేరుకోవచ్చు. హిందీలో మాట్లాడుతూ పెరిగిన నాకు... అది కంఫర్టబుల్ లాంగ్వేజ్ అయినప్పటికీ నటనకు అడ్డంకిగా లేదు. ఇపుడు తమిళం, తెలుగు అర్థం చేసుకుని మాట్లాడగలను. అదే సమయంలో సినీ ఇండస్ట్రీలో వేతన వివక్ష ఉంది. కాలక్రమంలో ఇది మారుతుందని భావిస్తున్నా' అని పేర్కొన్నారు.

రాజకీయాల్లోకి ఎవరైనా రావొచ్చు

● మారి సెల్వరాజ్



రాజకీయాల్లోకి ఎవరైనా రావొచ్చని ప్రముఖ సినీ దర్శకుడు మారి సెల్వరాజ్ అభిప్రాయపడ్డారు. ఒక సినిమా షూటింగ్ నిమిత్తం ఆయన తూత్తుక్కుడికి చెన్నై నుంచి విమానంలో శనివారం చేరుకున్నారు. ఈ సందర్భంగా ఆయన విలేకరులతో మాట్లాడుతూ... 'దక్షిణాది జిల్లాల్లో మానసికంగా ప్రతి ఒక్కరి మనసుల్లో కుల ముద్ర ఉంది. ఇది వారి మనసుల్లో లోతుగా నిక్షిప్తమైవుంది. దీన్ని ఒక్క రోజులో తొలగించలేం. కానీ కాలక్రమేణా అన్నీ మారుతాయి. ప్రతి ఒక్కరూ కలిసి దీన్ని తొలగించేందుకు గట్టిగా కృషి చేయాలి. ఇపుడు సినిమాలు ఓటీటీలో విడుదలవుతున్నాయి. ప్రతి ఒక్కరి ఇంట్లో పూజ గది ఉంటుంది. కానీ, ఆలయాలకు వెళ్లి దైవదర్శనం చేసుకుంటారు. అలాగే, ప్రతి ఒక్కరూ కలిసి సినిమా చూసే చోటు సినిమా థియేటర్. అది ఎప్పటికీ మారదు. నటుడు విజయ్ రాజకీయ ప్రవేశం ఆయన సొంతం ఇష్టం. రాజకీయాల్లోకి ప్రతి ఒక్కరూ రావొచ్చు' అని పేర్కొన్నారు.

కేదార్‌నాథ్ ఆలయంలో రజనీకాంత్ ప్రత్యేక పూజలు

హిమాలయాల్లో ఆధ్యాత్మిక పర్యటన కోసం వెళ్లిన సూపర్‌స్టార్ రజనీకాంత్ కేదార్‌నాథ్ ఆలయంలో ప్రత్యేక పూజలు చేశారు. శుక్రవారం ఆయన కేదార్‌నాథ్, బద్రీనాథ్ ఆలయాల్లో ప్రత్యేక పూజలు నిర్వహించి స్వామివార్లను దర్శించుకున్నారు. ఆయనకు ఆయా ఆలయాల పూజారులు, వేదపండితులు సాదర స్వాగతం పలికి, వేద ఆశీర్వచనం ఇచ్చి, ప్రసాదాలు అందజేశారు. ఈ సందర్భంగా తీసిన ఫొటోలు సోషల్ మీడియాలో వైరల్ అయ్యాయి. కాగా, ప్రస్తుతం టీజే జ్ఞానవేల్ దర్శకత్వంలో 'వేట్టైయన్' చిత్రంలో నటిస్తున్న రజనీకాంత్... ఇందులో తన పాత్రకు సంబంధించిన షూటింగ్ పూర్తి చేశారు. ఆ తర్వాత లోకేష్ కనకరాజ్ దర్శకత్వంలో 'కూలి' చిత్రంలో నటించనున్నారు. ఈ హిమాలయ ఆధ్యాత్మిక పర్యటన ముగించుకుని చెన్నైకు వచ్చిన తర్వాత ఈ చిత్ర షూటింగ్‌లో రజనీ పాల్గొననున్నారు.



ఆలయ పూజారులతో రజనీకాంత్

ప్రపంచ తెలుగు సమాఖ్య ఆధ్వర్యంలో

తెలుగు శిక్షణ తరగతులు ప్రారంభం



ప్రారంభోత్సవంలో శ్రీలక్ష్మి మోహనరావు, ఏవీ శివకుమారి, మాణిక్యం, మోహన్ తదితరులు



శిక్షణ తరగతికి హాజరైన ఔత్సాహికులు

ప్యారీస్, జూన్ 1: ప్రపంచ తెలుగు సమాఖ్య (డబ్ల్యూటీఎఫ్) ఆధ్వర్యంలో నాలుగు నెలలపాటు నిర్వహించనున్న ఉచిత తెలుగు భాషా శిక్షణ తరగతులు శనివారం ప్రారంభమయ్యాయి. స్థానిక టినగర్‌లోని డబ్ల్యూటీఎఫ్ ప్రధాన కార్యాలయంలో ప్రార్థనా గీతంతో ప్రారంభమైన ఈ శిబిరంలో కార్యదర్శి శ్రీలక్ష్మి మోహనరావు స్వాగతోపన్యాసం చేశారు. 2006 నుంచి డబ్ల్యూటీఎఫ్ నిర్వహిస్తున్న ఉచిత తెలుగు బోధనా తరగతుల ద్వారా ఇప్పటివరకు ఇతర భాషలకు చెందిన సుమారు 5,000 మంది లబ్ధిపొందారని తెలిపారు. డబ్ల్యూటీఎఫ్ అధ్యక్షురాలు డా.వీఎల్ ఇందిరాదత్ తెలుగు శిక్షణా శిబిరం విజయవంతం కావాలని ఆకాంక్షిస్తూ పంపించిన అభినందన సందేశాన్ని ఆమె సభకు చదివి వినిపించారు. ముఖ్యంగా మాతృభాషను ప్రతి తెలుగు కుటుంబంలోని సభ్యులందరూ పట్టుదలగా నేర్చుకొని భాషా పరిరక్షణకు ముందుకు రావాలని ఇందిరాదత్ తన సందేశం ద్వారా పిలుపునిచ్చారు. తొలిరోజు శిక్షణకు 60 మందికి పైగా హాజరయ్యారు. కాగా, నాలుగు నెలల ఈ శిక్షణా తరగతులు ప్రతి శనివారం సాయంత్రం 3 నుంచి 4 గంటల వరకు స్పోకెన్ తెలుగు, సాయంత్రం 4 నుంచి 5 గంటల వరకు చదవడం, రాయడంపై తెలుగు పండిట్ మోహన్, డబ్ల్యూటీఎఫ్ సభ్యురాలు మాణిక్యం, కో-ఆర్డినేటర్ డా.శివకుమారి నేర్పుతారు. ప్రారంభోత్సవంలో సంస్థ మాజీ సెక్రటరీ జనరల్ ఎం.ఆదిశేషయ్య, డీఎల్ఎన్ రెడ్డి, కోశాధికారి వెంకట్ మాదాల, సంయుక్త కోశాధికారి రుక్మిణి దేవి, సభ్యులు లలిత సుధాకర్, సురేఖ మోహన్‌దాస్, నిర్మలాదేవి, మీడియా ఇన్‌చార్జి గోటేటి వెంకటేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

కొత్త అందాలతో నంది విగ్రహం



నంది విగ్రహానికి రంగులు వేస్తున్న యువకులు

పెరంబూర్, జూన్ 1: సేలం జిల్లా మేట్టూరు డ్యాం పరివాహక ప్రాంతంలో బయల్పడిన నంది విగ్రహం సరికొత్త అందాలతో దర్శనమిస్తోంది. ఈ విగ్రహాన్ని చూసేందుకు చుట్టుపక్కల గ్రామాలకు చెందిన ప్రజలు పెద్ద ఎత్తున తరలి వస్తుండడంతో ఆ ప్రాంతం పర్యాటక కేంద్రంగా మారింది. మేట్టూరు డ్యాం నిర్మాణ సమయంలో కొన్ని ముంపు ప్రాంతాల గ్రామాల ప్రజలు ఇతర ప్రాంతాలకు తరలించారు. ముఖ్యంగా, పన్నవాడి పరిశల్‌తురై ప్రాంతంలోని భారీ నంది విగ్రహం, జలకంఠేశ్వరుడి ఆలయాన్ని ప్రజలు అలాగే వదిలేసి వెళ్లారు. 120 అడుగుల పూర్తి సామర్థ్యం కలిగిన మేట్టూరు డ్యాం నీటిమట్టాలు 65 అడుగులకు తగ్గిన సమయంలో నీటమునిగిన నంది విగ్రహం తల, 46 అడుగులకు తగ్గితే పూర్తి విగ్రహం బయటకు వస్తుంది. ప్రస్తుతం నీటిమట్టాలు 45 అడుగులకు తగ్గడంతో నంది విగ్రహం పూర్తిగా కనిపిస్తోంది. దీంతో, కొందరు యువకులు నంది విగ్రహానికి రంగులు వేసి కొత్త అందాలు సమకూర్చారు. పలువురు భక్తులు నంది విగ్రహానికి పాలు, పెరుగు, పన్నీరు తదితరాలతో అభిషేకాలు నిర్వహిస్తున్నారు.



లభ్యమైన కాళీ విగ్రహం

కాంస్య విగ్రహం లభ్యం

ఐసిఎఫ్, జూన్1: రామనాథపురం జిల్లా సముద్రతీరంలో కాంస్య కాళీ విగ్రహం లభించింది. శివగంగ జిల్లా కారైకుడికి చెందిన బాలమురుగన్ అనే యువకుడు ఇటీవల రామనాధపురం సమీపంలో ఉన్న స్వామితోపు సముద్రతీరానికి వెళ్లాడు. అలల్లో కొట్టుకొచ్చిన 1.5 అడుగుల ఎత్తున్న కాంస్య విగ్రహాన్ని గుర్తించి దానిని తన వెంట తెచ్చుకున్నాడు.ఈ విషయం గ్రామస్తులకు తెలియడంతో వారు ప్రభుత్వానికి అప్పగించాలని ఒత్తిడి చేశారు. ఆ విగ్రహాన్ని బాలమురుగన్ కారైకుడి పోలీసులకు అందజేయగా,పోలీసులు రెవెన్యూ శాఖ అధికారులకు అప్పగించారు.